క్లుప్తంగా

దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న ఆర్పీ ఫౌండేషన్ ప్రతినిధులు

సరుబుజ్జిలి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఆర్పీ ఫౌండేషన్ తరఫున శనివారం దుస్తులు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ సమాజంలో సహాయగుణం అలవాటు చేసుకోవాలని ఆర్పీ ఫౌండేషన్ ప్రతినిధులు బాలు, క్రాంతి, తూలుగు ధనుంజయరావు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.నాగేంద్ర, ఎన్ఎస్ఎస్ పీఓ రమేష్‌సాహు, అధ్యాపకుడు గొండు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రం పరిశీలన



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ నీరజ

కొత్తూరు: ప్రతీ పంచాయతీలో నిర్మించిన చెత్త సంపద కేంద్రాల్లో వర్మీ కంపోస్టును తయారు చేయాలని ఎంపీడీఓ నీరజ సూచించారు. మండలంలోని ఓంద్రుజోలలో చెత్త సంపద కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. ఈ కేంద్రంలో తయారు చేసిన 60 కిలోల వర్మీ కంపోస్టును రైతులుకు విక్రయిస్తున్నట్లు ఎంపీడీఓకు సిబ్బంది వివరించారు. కంపోస్టు ఎరువును రైతులు వినియోగించుకోవాలని ఎంపీడీఓ సూచించారు. గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపికైన తాడివలస విద్యార్థినులు

పొందూరు: మండలంలోని తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సత్యసాయి జిల్లా లేపాక్షిలో ఈ నెల 29, 30 తేదీల్లో జరుగుతున్న అండర్ 14 చెస్ చాంపియన్‌షిప్ పోటీలకు అంపోలు బిందుమాధవి ఎంపికయ్యారు. బాపట్ల జిల్లాలో ఈ నెల 28, 29 తేదీల్లో జరగనున్న అండర్ 17 విభాగంలో పైడి రక్షిత, బూరాడ ప్రియదర్శిని, పెద్దపూడి దేవి ఎంపికైనట్లు హెచ్ఎం బల్ల కంటయ్య, పీడీ దవళ పెంటయ్య తెలిపారు. వీరి ఎంపికపట్ల సర్పంచ్ తమ్మినైన మణెమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు సువ్వారి దివ్య, తల్లిదండ్రుల కమిటీ చైర్‌పర్సన్ తమ్మినైన అమ్మాజీ తదితరులు అభినందనలు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి



కొరసవాడ లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఏఈ సీతారామరాజు

పాతపట్నం: గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని మండల ప్రత్యేకాధికారి ఎం.కరుణాకరరావు అన్నారు. మండలంలోని కాగువాడ, కొరసవాడ గ్రామాల్లోని జగనన్న లేఅవుట్‌లను శనివారం హౌసింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాల పరిస్థితులను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి వారికి ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రూఫ్, స్టేజ్ లెవెల్ ఉన్న ఇళ్లను గుర్తించారు. హౌసింగ్ ఏఈ సీతారామరాజు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు నవీన్, కృష్ణ, సెక్రటరీ రాజు, వీఆర్వో తిరుపతిరావు, ఝాన్సీ, రవిశంకర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి కళాశాల సమస్యలు



ఎమ్మెల్యే గోవిందరావుకు వినతిపత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీరాములు, విద్యార్థులు

పాతపట్నం: స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలకు పంచాయతీ తాగునీరు, విద్యుత్ లైట్లు, ప్రహరీ నిర్మాణంతోపాటు పలు సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు ప్రిన్సిపాల్ కె.శ్రీరాములు, విద్యార్థులు శనివారం వినతిపత్రం అందజేశారు. బాలికల వసతి గృహం నిర్మాణం పూర్తయిందన్నారు. అద్దె ఇంటిలో ఉంటూ ఇబ్బంది పడుతున్నామని, వసతి గృహాన్ని ప్రారంభించాలని విద్యార్థినులు కోరారు. డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డేకు ఎమ్మెల్యే హాజరయ్యారు. విద్యార్థులు చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. వైస్ ప్రిన్సిపాల్ కె.చక్రపతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నిరుపయోగం



సరుబుజ్జిలి ఆర్టీసీ బస్‌స్టేషన్‌లోని మరుగుదొడ్లు పూర్తిగా మూతపడ్డాయి. మంచినీటి సరఫరాతోపాటు, నిర్వహణ కూడా సరిగా లేక పోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి. అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణీకులు అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా మహిళా ప్రయాణీకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

- సరుబుజ్జిలి

శిథిలావస్థ



జలుమూరులో ఉన్న వ్యవసాయ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. సుమారు 35 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ కార్యాలయం పెచ్చులూడుతున్నాయి. చిన్నపాటి వర్షం కురిస్తే శ్లాబు ముక్కలు ముక్కలుగా పడి సిబ్బందికి గాయాలైన సందర్భాలు కూడా ఉన్నాయి. భయం.. భయంతో విధులు నిర్వహిస్తున్నామని ఏఓ కె.సురేష్ కుమార్ తెలిపారు. విత్తనాలు, వివిధ పరికరాలు, ఎరువులు తదితరవి ప్రైవేట్‌గా ఒక గదిలో ఉంచాల్సి వస్తోందన్నారు. కార్యాలయానికి రైతులు వచ్చి అధికారులతో మాట్లాడలేని పరిస్థితి ఉందన్నారు.

- జలుమూరు

అధ్వానం



ఎల్.ఎన్.పేట మండలంలోని అలికాం–బత్తిలి (ఏబీ) ప్రధాన రహదారి మోదుగువలస నుంచి కొమ్ముువలస, గొట్టిపల్లి గ్రామాలకు వెళ్లే రోడ్డు చెరువును తలపిస్తోంది. ఈ ఏడాది కురిసిన వర్షాలకు అడుగో గోయ్యి ఏర్పడింది. ద్విచక్ర వాహనంపై వెళ్లేందుకు కూడా ఇబ్బంది పడుతున్నామన్నారు. అత్యవసర వేళల్లో ఆటో కూడా వెళ్లలేని దుస్థితి ఏర్పడింది. అధికారులు స్పందించి గోతులు కప్పేందుకు చర్యలు తీసుకోవాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

- ఎల్.ఎన్.పేట

బావిని బాగు చేయరూ..



ఎల్.ఎన్.పేట మండలం కృష్ణాపురం గ్రామంలో తాగునీటి బావి శిథిలావస్థకు చేరుకుంది. 1962లో గ్రామ ప్రవేశంలో ప్రభుత్వ పాఠశాల వద్ద గ్రామ పెద్దల సహకారంతో బావిని తవ్వారు. బావి గోడ శిథిలావస్థకు చేరుకుందన్నారు. స్నానాలకు, ఇతర అవసరాలకు బావి నీటిపైనే ఆధారపడుతున్నారని గ్రామస్తులు తెలిపారు. అధికారులు స్పందించి బావిని బాగుచేయాలని కోరుతున్నారు.

- ఎల్.ఎన్.పేట

ఇన్‌చార్జి పాలనతో.. కాలయాపన



మండల పరిషత్ కార్యాలయం

- పూర్తిస్థాయి అధికారులను నియమించేదెప్పుడు..?
- పీఆర్, విద్యుత్, ఆర్అండ్‌బీ తదితర కీలక శాఖల్లో ఖాళీలు..
- బదిలీలు జరిగినా ఒక్కరూ రాలేదు..



అధ్వానంగా ఉన్న కొమ్ముువలస రోడ్డు

ఎల్.ఎన్.పేట: ఎల్.ఎన్.పేట మండలం 1999 ఫిబ్రవరి 26వ తేదీన ఏర్పడింది. ఎల్.ఎన్.పేట కేంద్రంగా మొదటిగా రెవెన్యూ పరిపాలన తీసుకుని వచ్చారు. అక్కడికి రెండేళ్ల తరువాత అంచెలంచెలుగా మండల పరిషత్ పాలన తీసుకుచ్చారు. మండలం ఆవిర్భవించినప్పటి నుంచి రెండున్నర దశాబ్దాలు కావస్తున్నప్పటికీ అభివృద్ధికి దూరంగానే ఉంది. పరిపాలనాపరంగా పరిశీలిస్తే ఒకవైపు పూర్తిస్థాయి అధికారులు లేకపోగా.. మరోవైపు పలు శాఖలకు పూర్తిస్థాయి భవనాలు కూడా కరువయ్యాయి. ప్రజల సమస్యలు పరిష్కారం కాకపోగా.. గ్రామాల అభివృద్ధి కూడా అంతంతమాత్రంగానే ఉంది. పరిపాలనపరంగా చూస్తే.. కీలక శాఖల్లో విధులు నిర్వహించే ఏఈ స్థాయి అధికారులు ఇన్‌చార్జిల పాలనలోనే కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత అన్ని శాఖల్లోనూ అధికారులు, ఉద్యోగుల బదిలీలను నిర్వహించారు. అయినప్పటికీ ఎల్.ఎన్.పేట మండలానికి పూర్తిస్థాయిలో విధులు నిర్వహించే ఏఈలు రాలేదు.

అభివృద్ధికి దూరంగా గ్రామాలు..

కీలకమైన పలు శాఖల్లో పూర్తిస్థాయిలో విధులు నిర్వహించే అధికారులు లేకపోవటంతో అభివృద్ధి కుంటుపడుతోంది. విద్యుత్, పీఆర్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ తదితర శాఖలకు హిరమండలం మండలంలో విధులు నిర్వహించే ఏఈలే ఇన్‌చార్జిలుగా విధులు నిర్వహిస్తున్నారు.

- మండలం ఏర్పడిన తరువాత రావిచంద్రి వద్ద 2005లో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. మండలంలో సుమారు 11వేల విద్యుత్ వినియోగదారులున్నారు. సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసి సుమారు రెండు దశాబ్దాలు అవుతున్నా విద్యుత్ శాఖలో విధులు నిర్వహించే పూర్తిస్థాయి ఏఈ నియామకం ఇప్పటికీ జరగలేదు.
- మండలంలో 22 పంచాయతీలు, 12 గ్రామ సచివాలయాలు, 66 గ్రామాలు ఉన్నాయి. గ్రామాల అభివృద్ధిలో భాగంగా సీసీ డ్రైన్లు, రహదారులతో పాటు ఇతర రోడ్లు, భవనాల నిర్మాణం పనులు చేపట్టేందుకు పూర్తిస్థాయిలో పీఆర్ ఏఈ లేరు.
- ఆర్అండ్‌బీ పాలన ఇన్‌చార్జి అధికారి చేతిలోనే ఉంది. మండలంలోని అలికాం–బత్తిలి ప్రధాన రహదారితోపాటు ఆర్అండ్‌బీ రోడ్లు రాళ్లు తేలి, చెరువులను తలపించేలా ఉన్నాయి.
- మండలంలో 10,850 ఎకరాల్లో పంటలు పండిస్తారు. సుమారు 160 సాగునీటి చెరువులు, 15 కిలో మీటర్ల మేర వంశధార కుడి ప్రధాన కాలువ, 45 కిలో మీటర్ల మేర వంశధార పిల్ల కాలువలు, సాగునీటి గెడ్డలున్నాయి. సాగునీటి వనరుల పర్యవేక్షణ, అభివృద్ధి, బాగోగులు చూసే ఇరిగేషన్ శాఖ కూడా ఇన్‌చార్జి పాలనలో కొనసాగుతోంది.

అధికారులు స్పందించాలి



మండలంలో పలు శాఖల్లో విధులు నిర్వహించేందుకు పూర్తిస్థాయి ఏఈలను నియమించేందుకు జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి. విద్యుత్, ఆర్అండ్‌బీ, పీఆర్, ఇరిగేషన్ తదితర శాఖలకు పూర్తిస్థాయి అధికారులు లేకపోవటం వల్ల అభివృద్ధిలో మండలం వెనుకబడిపోతుంది.

– పెనుమజ్జి విష్ణుమూర్తి, వైఎస్సార్‌సీపీ మండల ప్రెసిడెంట్, ఎల్.ఎన్.పేట

పరిస్థితి నివేదించాం



పలు శాఖలకు పూర్తిస్థాయిలో విధులు నిర్వహించే అధికారులను కేటాయించాలని కోరుతూ జిల్లా అధికారులకు నివేదించటం జరిగింది. ఇప్పటికే ఆర్‌డబ్ల్యూఎస్ జేఈని కేటాయించారు. మిగిలిన శాఖలకు ఏఈలను నియమించాల్సి ఉది. సమస్యలు ఎమైనా ఉంటే తన దృష్టికి తీసుకుని వస్తే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాను.

– పి.శ్రీనివాసరావు, ఎంపీడీఓ, ఎల్.ఎన్.పేట

రసాభాసగా మండల సమావేశం



సమస్యలపై ప్రశ్నిస్తున్న తొగరాం సర్పంచ్ తమ్మినేని వాణీసీతారాం

- వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌ల వాకౌట్
- ఎంపీడీఓ కార్యాలయం బయట బైఠాయింపు
- ఎంపీడీఓపై చర్యలు చేపట్టాలని తొగరాం సర్పంచ్ వాణీ సీతారాం డిమాండ్



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బైఠాయించిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు

ఆమదాలవలస: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాల్లో కక్ష సాధింపు చర్యలు అధికంగా ఉన్నాయని, వైఎస్సార్‌సీపీకి చెందిన గ్రామ సర్పంచ్‌ల హక్కులు కాలరాస్తున్నారని తొగరాం సర్పంచ్ తమ్మినేని వాణీసీతారాం ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆమదాలవలస ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకటరావు ఆధ్వర్యంలో మండల సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీపీ తమ్మినేని శారదమ్మ అధ్యక్షత వహించారు. ఎంపీపీ తనయుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి సమావేశాన్ని ప్రారంభించి అధికారులకు మాట్లాడాలని చెప్పారు. తొలిత వ్యవసాయశాఖ ఏఓ మోహన్‌రావు తన మాట్లాడుతుండగా నెల్లిపర్తి సర్పంచ్ కలుగజేసుకున్నారు. విత్తనాలు, ఎరువులు సక్రమంగా అందక రైతులు ఇక్కట్లు పడ్డారన్నారు. దీనికి స్పందించిన ఏఓ గ్రామాలకు అందించిన వివరాలు తెలిపారు. తొగరాం గ్రామానికి ఎన్ని డీఏపీ బస్తాలు అందించారని సర్పంచ్ తమ్మినేని వాణీసీతారాం ప్రశ్నించారు. దీనికి ఏఓ సమాధానం చెప్పలేక ప్రైవేట్ దుకాణాల ద్వారా ఎరువులు ఇప్పించామన్నారు. వాణీ సీతారాం సమాధానం చెబుతుండగా తొగరాం టీడీపీ నాయకుడు తమ్మినేని చంద్రశేఖర్ జోక్యం చేసుకున్నారు. టీడీపీ కార్యకర్తలు వచ్చిన సమావేశంలో మాట్లాడితే ఏలా అని అధికారులను వాణీసీతారాం ప్రశ్నించారు. ప్రొటోకాల్ పాటించాలని ఎంపీడీఓ, ఎంపీపీ శారదమ్మను కోరుతూ డిమాండ్ చేశారు. దీంతో సమావేశం మందిరం కాసేపు రసాభాసగా మారింది. టీడీపీ కార్యకర్తల మాటలకు నిరసన తెలుపుతూ వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు వాకౌట్ చేశారు. కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఈ సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తాండ్ర లక్ష్మి, మానుకొండ ధనలక్ష్మి, చల్లా సింహాచలం, సైలాడ దాసు నాయుడు, మానుకొండ వెంకటరమణ, కూటికుప్పల ఉషారాణి, సన్యాసిరావు, టీడీపీ నాయకులు సనపల ఢిల్లేశ్వరరావు, అన్నెపు భాస్కరరావు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ తీరుపై అభ్యంతరం..

ఎంపీపీ తమ్మినేని శారదమ్మ వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గుర్తుపై గెలిచి తనయుడు శ్రీరామ్మూర్తిని డయాస్‌పై కూర్చొపెట్టారని, వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు కనీసం గౌరవం కూడా ఇవ్వకుండా టీడీపీతో కుమ్మక్కవడం ఎంతవరకు సబబు అని తొగరాం సర్పంచ్ వాణీసీతారాం ప్రశ్నించారు. ప్రభుత్వాలు వస్తుంటాయి, పోతుంటాయని, కనీసం నైతిక విలువలు పాటించాలన్నారు. ప్రతినిధులను బయటకు వెళ్లమని చెప్పమంటే.. మాకు కూర్చోవాలని హెచ్చరించడం ఎంతవరకు న్యాయమన్నారు. ఇలాంటి సమావేశం నిర్వహించినందుకు ఎంపీడీఓపై చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

పరీక్షలకు సన్నద్ధం కావాలి



మాట్లాడుతున్న డీవీఈఓ తవిటినాయుడు

నరసన్నపేట: ఇంటర్ విద్యార్థులు మరో నాలుగు నెలల్లో జరగనున్న పరీక్షలకు ప్రణాళికలు ఇప్పటి నుంచే రూపొందించుకుని సన్నద్ధం కావాలని జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి తవిటినాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను శనివారం తనిఖీ చేశారు. కళాశాల రికార్డులు పరిశీలించారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రైవేట్ కంటే ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు అత్యధిక మార్కులు పొందాలన్నారు. ఉత్తీర్ణత శాతం పెంచాలని అధ్యాపకులకు ఆదేశించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నామని, దీనిని వినియోగించుకోవాలని కోరారు. ప్రత్యేక స్టడీ అవర్స్ ఇప్పటి నుంచే నిర్వహించాలన్నారు. అకౌంటింగ్ అండ్ టాక్సేషన్ గ్రూపులో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రత్యేక స్టడీ మెటీరియల్‌ను డీవీఈఓ అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సత్యనారాయణ, అధ్యాపకులు పలువురు పాల్గొన్నారు.

పంట మార్పిడితో భూసారం

- జిల్లా వ్యవసాయాధికారి త్రినాథస్వామి



రైతులుకు సూచనలిస్తున్న త్రినాథస్వామి, తదితరులు

నరసన్నపేట: ఏటా ఒకే పంట వేసే కంటే సీజన్‌కు ఒక పంట చేస్తే భూమి సారవంతం అవుతుందని, దిగుబడి పెరుగుతుందని జిల్లా వ్యవసాయాధికారి త్రినాథస్వామి అన్నారు. మండలంలోని సత్యవరం కూడలి వద్ద వరి పొలాలను శనివారం పరిశీలించారు. అపరాలు సాగుపై దృష్టి పెట్టాలని, ఇప్పటి నుంచే విత్తనాలు సిద్ధం చేసుకుంటే మంచిదన్నారు. సరైన సమయం చూసుకుని పెసర, మినుగు విత్తనాలు వేయాలన్నారు. వేసవిలో ఆరుతడి పంటలు వేయాలన్నారు. మొక్కజొన్న పంట వేసిన రైతులకు రెండేళ్ల నుంచి మంచి ఆదాయం వస్తుందన్నారు. యాంత్రీకరణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనకాపల్లి రీసెర్చ్ సెంటర్ అసోసియేట్ డైరెక్టర్ ముకుందరావు, రాగోలు శాస్త్రవేత్త ఉదయబాబు, ఏపీ సీడ్స్ మేనేజర్ బాలకృష్ణ, నరసన్నపేట వ్యవయాధికారి కె.సునీత తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా పశు గణన

- పశుసంవర్ధకశాఖ ఏడీ కరుణాకరరావు



పాతపట్నం కోర్టు కూడలి వద్ద పశుగణనను పరిశీలిస్తున్న ఏడీ కరుణాకరరావు

పాతపట్నం: అఖిల భారత పశు గణనను పక్కాగా లెక్కించాలని అధికారులకు పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు ఎం.కరుణాకరరావు ఆదేశించారు. పాతపట్నం మండల కేంద్రంలో ఇంటింటికీ వెళ్లి పశు గణన తీరును శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ పాతపట్నం మండలంలో ఏడుగురు సభ్యులతోనూ, మెళియాపుట్టి మండలంలో ఐదుగురు సభ్యులతోనూ ప్రతి ఇంటికీ వెళ్లి పశు గణన చేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ పథకాల అమలుకు, జాతీయ, రాష్ట్ర స్థూల ఉత్పత్తులు లెక్కలు కట్టడానికి ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి బి.శ్రీవాణి, గుణాలమ్మ, కుమారి, నారాయణ పాల్గొన్నారు.

పదో తరగతి కీలకం..

జలుమూరు: ప్రతీ విద్యార్థికి పదో తరగతి ఎంతో కీలకమని, క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని స్వామిబాబు–వజ్రమ్మ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు డి.రమేష్, ఎస్.రామారావు, కరుణశ్రీ, దివ్య, శ్రీదేవి అన్నారు. శనివారం లింగాలవలస ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పదో తరగతి తరువాత వారు ఎంచుకున్న మార్గం, ఏం చదవాలి, ఏం అవ్వాలన్నది ప్రొజెక్టర్ సాయంతో అవగాహన కల్పించారు. లక్ష్యం ఎలా చేరుకోవాలి, ఉన్నత చదువులు ఎలా చదవాలన్నది వివరించారు. ఏ మార్గం ఎంచుకున్నా లక్ష్య సాధనకు కఠోర శ్రమ అవసరమన్నారు. ప్రణాళికాబద్ధంగా చదవాలని, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెచ్ఎం ఉంగటి అప్పల సూర్యనారాయణ, బమ్మిడి శ్రీనివాసరావు, జల్లు రమణమూర్తి, గార విశ్వనాథం, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం

నరసన్నపేట: స్థానిక కలివరపుపేటకు చెందిన ఇంటర్ విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సి.హెచ్.దుర్గాప్రసాద్ శనివారం తెలిపారు. విద్యార్థిని శ్రీకాకుళం ఉమెన్స్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నట్లు తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. మూడు రోజుల క్రితం ఆలయానికి వెళ్లి వస్తానని చెప్పి ఇంతవరకు తిరిగి రాలేదన్నారు. సమీప బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్దకూడా లేకపోవడంతో శుక్రవారం రాత్రి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సి.హెచ్.దుర్గాప్రసాద్ శనివారం తెలిపారు.

ఎత్తిపోతల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

జలుమూరు: ఎత్తిపోతల పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గ రమణమూర్తి అన్నారు. శనివారం టెక్కలిపాడులోని ఎత్తిపోతల పథకాన్ని పునఃప్రారంభించారు. ఇటీవల ఎత్తిపోతల పథకం మరమ్మతులకు గురైతే రూ.5.6 లక్షల నిధులతో వినియోగంలోకి తెచ్చారు. నిర్వహణ బాధ్యతను రైతులు తీసుకోవాలన్నారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కోలాటం



కోలాటం ఆడుతున్న విద్యార్థులు

పొందూరు: మండలంలోని రాపాక గ్రామంలో శనివారం గౌరీదేవీ, నందీశ్వరుల విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వరి పంట బాగా పండాలని శివాలయంలో గౌరీదేవి, నందీశ్వరుల విగ్రహాలకు 11 రోజులపాటు పూజలు చేశారు. డప్పు వాయిద్యాలు, వివిధ వేషధారణలతో విగ్రహాలను ఊరేగించారు. నిమజ్జన కార్యక్రమంలో విద్యార్థుల కోలాటం ఎంతగానో ఆకట్టుకుంది.

సంక్షిప్తంగా..

నిర్మాణాలు వేగవంతం చేయాలి

హిరమండలం: పీఎం జన్‌మాన్ పథకం ద్వారా చేపడుతున్న మల్టీపర్పస్ భవనాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఐటీడీఏ ఏపీఓ జి.చిన్నబాబు అన్నారు. శనివారం మండలంలోని చాపరాయిగూడ, పెద్దగూడ, మన్‌మోహన్‌గూడ గిరిజన గ్రామాల్లో నిర్మిస్తున్న భవనాలను పరిశీలించారు. భవన నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించకూడదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఒక్కో భవనానికి రూ.60 లక్షల నిధులు మంజూరు చేసిందన్నారు. ఐటీడీఏ పరిధిలో 31 భవనాలు మంజూరయ్యాయన్నారు.

సత్యసాయి ప్రేమ స్వరూపుడు

జలుమూరు: సత్యసాయి ప్రేమ స్వరూపుడని, ఆయన బోధనలు అనుసరణీయమని సత్యసాయి సేవా సంస్థల ఆధ్యాత్మిక సమన్వయకర్త, జిల్లా సేవాదళ్ సమన్వయకర్త అనాధ గుప్త, నాగేశ్వరరావు అన్నారు. శనివారం అచ్యుతాపురంలో 100 గంటల అఖండ నామసంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా రైస్ కలెక్షన్ ఇన్‌చార్జి అమ్మాయమ్మ, జోనల్ సమన్వయకర్త మూర్తి, కోఆర్డినేటర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

34 గోశాలలు మంజూరు

కొత్తూరు: మండలానికి 34 గోశాలలు మంజూరయ్యాయని మండల పశువైద్యాధికారి హరికృష్ణ శనివారం తెలిపారు. అందులో ఎస్టీలకు 3, ఎస్సీలకు 5, మిగిలిన 26 ఓసీలకు కేటాయించినట్లు చెప్పారు. ఇంతవరకు 22 దరఖాస్తులను ప్రభుత్వానికి ప్రతిపాదించగా.. 18 మందికి గోశాలలు నిర్మాణం చేసేందుకు ఆదేశాలు వచ్చాయన్నారు. మంజూరైన వాటిలో రెండు ఆవులు ఉన్న గోశాలలు 5 (ఒక్కొక్క గోశాలకు రూ.1.15 లక్షలు), నాలుగు ఆవులు ఉన్న గోశాలలు 2 (ఒక్కొక్క గోశాలకు రూ.1.80లక్షలు), ఆరు ఆవులు ఉన్న గోసాలలు 9 (ఒక్కొక్క గోశాలకు రూ.2.30 లక్షలు), మేకలు, గొర్రెల షెడ్లు 2 (ఒక్కొక్క షెడ్‌కు రూ.2.30 లక్షలు) మంజూరయ్యాయన్నారు. గోశాలలు ఉపాధి నిధులతో నిర్మించడం జరుగుతుందన్నారు.

ఓపెన్ హౌస్

కొత్తూరు: పోలీసు అమరవీరుల స్మారక వారోత్సవాలలో భాగంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ ఎం.ఎ.అహ్మద్ ఆధ్వర్యంలో శనివారం ఓపెన్ హౌస్ నిర్వహించారు. పోలీసు అమరవీరుల స్మారక వారోత్సవాల విశిష్టతను ఎస్‌ఐ వివరించారు. పోలీసులు వినియోగిస్తున్న పలు రకాల తుపాకీల ప్రదర్శనతోపాటు వాటిని ఏ విధంగా వినియోగించాలనేది విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోలీసుల విధులు, బాధ్యతలు, ఎఫ్ఐఆర్ కోసం విద్యార్థులకు వివరించారు. పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

రహదారి నిబంధనలు పాటించాలి..

ప్రతీ వాహనదారుడు రహదారి నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ తెలిపారు. కొత్తూరులోని పాలకొండ రోడ్డులో వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు లేనివారు నుంచి అపరాధ రుసుం వసూలు చేశారు. ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నరసన్నపేటలో..

నరసన్నపేట: పోలీసు అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నరసన్నపేట ఎస్‌ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ పోలీసుల విధులు, బాధ్యతలు, ఫిర్యాదులు ఎలా ఇవ్వాలి, పోలీసు స్టేషన్‌లో ఎవరెవరు ఉంటారు, ఏం ఉంటాయనేది వివరించారు.

విజిలెన్స్ డేపై అవగాహన

నరసన్నపేట: మహమ్మరిలా పట్టిపీడిస్తున్న అవినీతి భూతం నిర్మూలనకు యువత ముందుకు రావాలని వక్తలు పిలుపునిచ్చారు. స్థానిక ఎల్‌వీఆర్ డిగ్రీ కళాశాలలో మూలపేట వివేకానంద యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో విజిలెన్స్ డేపై విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. స్థానిక పోలీసు స్టేషన్ రైటర్ దాలినాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ప్రసాదరావు, ఏఓ జగన్నాథరావు, ఎన్ఎస్ఎస్ పీఓ మోహనరావు మాట్లాడుతూ అవినీతిని అరికట్టడంతో యువత, విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రజలకు అవగాహన కల్పిస్తే చాలావరకు అవినీతిని అరికట్టవచ్చన్నారు. ప్రతీ ఒక్కరూ ప్రశ్నించడం అలవరచుకోవాలని సూచించారు. యువజన సంఘం ప్రతినిధులు వెంకటరమణ, గుజ్జల ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

పాతపట్నం: పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కొరసవాడ ఎంపీపీ పాఠశాల హెచ్ఎం పార్వతి అన్నారు. శనివారం పాఠశాలలో సెంచూరియన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పర్యావరణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కొరసవాడ గ్రామంలో మొక్కలు నాటాలని అవగాహన కల్పించారు. సెంచూరియన్ యూనివర్సిటీ వ్యవసాయ విభాగం విద్యార్థులు కొరసవాడలో ఇంటింటికి వెళ్లి మొక్కలు అందించారు.

పరిసరాల శుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

జలుమూరు: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని జలుమూరు పీహెచ్‌సీ ఆరోగ్య పరిరక్షణ అధికారి యు.చిన్నరాజులు అన్నారు. శనివారం జలుమూరు పంచాయతీ పరిధి పెద్దనామాలపేటలో వైద్య శిబిరం నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, జ్వరం, దగ్గు, జలుబు ఉంటే వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. హెల్త్ అసిస్టెంట్లు చిన్నారావు, రవి, నాగేశ్వరరావు, ఆరోగ్య కార్యకర్తలు నాగమణి, రమ్య సిబ్బంది పాల్గొన్నారు.